# వక్రించిన విధి



❋

* రచన: శశి తేజ్ *

"నవ్వంటే నాకు ఎప్పుడూ యిష్టం లేదు. ఈ విధంగా ప్రవర్తిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది." అంది విజయ తీక్షణంగా అతడి కేసి చూస్తూ.

పేరుకి తగ్గట్టు ఎంతో విందుగా, హుందాగా, వినమ్రంగా మాట్లాడే అమ్మాయి ఆ విధంగా సాయిరామ్‌కి వార్నింగ్ యిచ్చినట్లు సంభాషించడం అప్పుడే క్లాస్‌లో నుంచి వెలుపలికి వస్తున్న రవికి, మూర్తికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ఏవిటి అసలు విషయం?" కాలేజి గేటు దాటుతూ అడిగేడు రవి.

"కొత్తగా చెప్పేదేం వుంది. తెలిసిందేగా మన సాయి ఆ అమ్మాయిని ఎంతగా ఆరాధిస్తాడో కాలేజీలో అందరికీ తెలుసు. అయినా, ప్చ్... పాపం.... మనవాడ్ని దేవి కటాక్షించేటట్టు లేదు." అన్నాడు మూర్తి హోటల్‌కి దారి తీస్తూ.

విజయ అన్న మాటలు యింకా అతగాడికి మెదడులో గింగురుమంటున్నాయి. కాసేపు ఏమీ మాట్లాడలేదు సాయి. ఆమె పట్ల అతగాడి మూగప్రేమ చూస్తుంటే చాల జాలి, స్పెషల్ సానుభూతి కలిగితీరుతుంది ఎవరికైనా. ఆ అమ్మాయి మాత్రం కనీసం ఇతడ్ని ఫ్రెండ్‌గానైనా ట్రీట్ చేయదు. 'విజయనిగాని పెళ్ళి చేసుకోపోతే నే నసలు బ్రతకను!' అంటుంటాడు అప్పుడప్పుడు.

"సర్లేవోయ్! అప్ట్రాల్ ఓ ఆడపిల్ల కా నన్నంత మాత్రాన చావడమేనా?" అని మందలించే వాళ్ళం.

"మీకలానే ఉండొచ్చు. కాని మనసుకి ఓసారి 'ఇష్టం' అనే గాలం చిక్కుకుంటే దాన్ని విడదీయడం ఎంత కష్టమో మీకూ నా పరిస్థితి ఎదురైతే తెలుస్తుంది." అనేవాడు సాయి.

ఆ క్షణంలో సాయి వాలకం చూస్తుంటే.... ప్చ్ - 'విజయ్' ఎంత కర్కశత్వం ప్రదర్శిస్తోంది. ఛీ....ఏమిటో ఈ ఆడాళ్ళు. గొర్రె, కసాయివాణ్ణి నమ్ముతుందన్నట్టుగా బూటకం, కపటం లోపల దాచుకొని పైకి ప్రేమించినట్టు నటించి క్షణికమైన అవసరాలు తీరిన తర్వాత కాగితాల్లా విసరేసే షోకిల్లారాయుళ్ళని చూసి మోసపోతారు. 'సాయి' లాంటి వాణ్ణి కనుచూపు మేరలోనైనా చూడడానికి ఇష్టపడని విజయ లాంటి వాళ్ళు. నిరాశ ప్రస్ఫుటంగా మొహంలో కనుపిస్తున్న సాయిని చూస్తూ అన్నాడు మూర్తి.

"వద్దు మొర్రో అన్నా, ఆ అమ్మాయినే పట్టుకు వ్రేలాడక పోతే ఇక యీ దేశంలో ఆడాళ్ళే లేరా?" తను యిచ్చిన సలహా ఎంత యూజ్‌లెసో తనకి అందరి కంటే బాగా తెలుసు. అయినా ఓదార్చాలి గదా!

"సాయీ, నాదో చిన్న ప్రశ్న!" అన్నాడు రవి సాలోచనగా.

"ఏమిటి?" సాయి పరధ్యానంలో నుంచే జవాబిచ్చేడు.

"నువ్వు ఆ విజయ కోసం ఏం చెయ్యడానికైనా సిద్ధమే కదా?"

"ఎందుకా ప్రశ్న యిప్పుడు?"

"మరేం లేదు. నువ్వు చేయవలసిన పని ఇంకొకటే మిగిలిపోయింది. అదేమిటంటే ధైర్యం చేసి ఓ అందమైన ప్రేమలేఖ రాసి ఆ అమ్మాయికి యివ్వడం!...." ముగించాడు రవి.

"ఆహా! చాల బావుంది మీ ఐడియా....చెప్పు తీసి కొడ్తే అప్పుడు వదేది నే ననేగా నీ ధీమా?" సాయి వెటకారంగా అన్నాడు.

"ఎలాగా బాబూ. నీతో చచ్చేది?" విసుగొచ్చింది మూర్తికి.

నిజానికి రవి యిచ్చిన సలహాని ఆచరణలో ఎప్పుడో పెట్టి చూశాడు సాయి. అయితే ఆ ప్రయత్నం బెడిసి కొట్టిందని ఏ మొహం పెట్టుకొని చెప్పగలడు?

"పోయి-పోయి ఆ మొండి ఘటాన్ని ప్రేమించక పోతే, ఇంకా మన క్లాసులో చాల మంది చబ్బారుగా అమ్మాయిలు - రమణి, కళ్యాణి, రాజేశ్వరి, అరుణ వాళ్ళలో

ఎవరో ఒకర్ని ప్రేమించి ఏడవలేక పోయావా!" అన్నాడు మూర్తి.

"వాళ్ళందర్నీ మన మిత్రబృందానికి త్యాగం చేశాన్లె!" అంటూ లేచాడు సాయి. మిత్రులంతా ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళారు.

*　　　*　　　*

పదేళ్లు గడిచాయి కాలచక్రంలో. ఒకరోజు బజారులో రవి వెళుతుంటే హఠాత్తుగా కలిశాడు సాయి. "మళ్ళీ ఇన్నాళ్ళకు ఎంత దైవికంగా కలిశాం!" అంటూ ఇద్దరికీ చాల సంతోష మనిపించింది.

"నేను విజయవాడలో ఆటో మొబైల్ షాప్ నడుపుతున్నా, నువ్వెప్పుడన్నా వస్తే గవర్నర్ పేటలోని 'విజయ ఆటో మొబైల్ షాప్' పేరు చెప్తే ఎవరైనా చెప్తారు." అన్నాడు మాటల సందర్భంలో సాయి.

ఒక చిన్న మందహాసపు రేఖ రవి మొహంలో కనిపించింది.

"ఏమిటో అదోలా...." అన్నాడు సాయి.

"అహ, మరేం లేదు. మన కాలేజి డేస్‌లో విజయ అంటే చచ్చిపోయేవాడివి కదా! ఇప్పుడది జ్ఞాపకం వస్తే ఎలా అనిపిస్తుంది నీకు?" ఆత్రుతగా అడిగేడు రవి.

పాత జ్ఞాపకాలు చేసుకుంటూ ఓ క్షణం కళ్ళు మూసి చెప్పేడు సాయి. "ఇప్పటికీ విజయని తలుచుకుంటుంటే తీయటి స్వప్నం లాంటి ఆ రోజుల్లోకి మళ్ళీ వెళ్ళిపోతే ఎంత బాగుంటుంది అనిపిస్తుంది. మళ్ళీ ఆవిడగాని కనిపిస్తే నా భార్యా పిల్లల్ని చూపించి పరిచయం చేసినపుడు ఆవిడ



ఫేస్‌లో ఎక్స్‌ప్రెషన్స్ ఎలా ఉంటాయో చూడాలని పిస్తోంది." అన్నాడు సాయి చిరునవ్వుతో.

"ఇక విజయని చూసే అవకాశం లేదు." అన్నాడు రవి భారంగా.

"ఏమిటి విషయం - పెళ్ళి చేసుకొని వెళ్ళిపోయుం టుంది." వళ్ళు విరుచుకుంటూ అన్నాడు సాయి.

"వెళ్ళిపోయిన మాట నిజమే కాని, అత్తవారింటికి కాదు - ఇక ఎవరికీ కనిపించని చోటుకి. ప్రేమించినవాణ్ని పెళ్ళి చేసుకొనేందుకు ఇంట్లో అనుమతించక పోవడంతో ఆ అఘాయిత్యం చేసుకొంది."

మెదడులోని కోట్ల నరాలు నుగ్గు నుగ్గు అయిపోయా యనిపించింది సాయికి ఆ వార్త వినడంతో. 'ఆనాడు తనని తిరస్కరించింది విజయ. ఈ నాడు విధి తిరస్కరించింది ఆమెను ఈ లోకంలో ఉండకూడదంటూ. ఎంత మాయా ప్రపంచ మిది.... అందింది అవసరం లేదంటాం! అవసరమున్నది దొరకలేదంటూ బాధ పడుతుంటాం!' తనలో తనే ఏదేదో సముదాయించుకుంటున్నాడు సాయి.

Regd. No
6233




Phone :
21852

* కలర్ బనియన్లు, * డోరియా, * జెట్టీలు.